క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష ఉచిత మెగా వైద్య శిబిరం

కారెంపూడి: మండలంలోని నరమాలపాడు గ్రామంలో జగనన్న సురక్ష ఉచిత మెగా వైద్య శిబిరం శనివారం జరుగుతుందని శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభిస్తారని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆర్థోపెడిక్ డాక్టర్ రఘునందన్, డాక్టర్ నాగేంద్ర ఎండీ జనరల్, పీహెచ్‌సీల డాక్టర్లు, సిబ్బంది వైద్య సేవలందిస్తారని పేర్కొన్నారు. వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి గుర్తించిన వివిధ రకాల అనారోగ్య సమస్యలున్న వారితో పాటు మిగిలిన ప్రజలు కూడా ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే శిబిరంలో వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. అలాగే మూడవ తేదీ చినకొదమగుండ్ల గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

ఆలయాలకు నూతన అధ్యక్షుల ఎన్నిక



కారెంపూడి: స్థానిక వీరాంజనేయ స్వామి, షిరిడీ సాయి మందిరాల నిర్వాహక కమిటీ అధ్యక్షుల ఎన్నిక శుక్రవారం జరిగింది. మహిళా భక్తులందరూ సమావేశమై వీరాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీ అధ్యక్షురాలుగా కోట లక్ష్మిని, షిరిడీ సాయి మందిర కమిటీ అధ్యక్షురాలుగా గుండా మల్లేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గాన్ని తదుపరి సమావేశంలో ఎన్నిక చేసుకోవాలని తీర్మానించుకున్నారు. అనంతరం సభ్యులంతా షిరిడీ సాయినాథునికి, వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దిలీప్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



దాచేపల్లి : కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. దాచేపల్లికి చెందిన బొడ్ల శ్రీను కుమారుడు నరసింహ(20) పొందుగల సమీపంలోని కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహకు ఈదులగూడెంకు చెందిన శిరీషతో వివాహమైంది. శిరీష తొమ్మిది నెలల గర్భవతి. భార్య పుట్టింటికి వెళ్లటంతో నరసింహ కూడా వెళ్లాడు. ఈ క్రమంలో కుమార్తె పట్ల నరసింహ అవలంబిస్తున్న విధానంపై ఆమె తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో దాచేపల్లికి వచ్చి తల్లిదండ్రులకు ఈ విషయాన్ని నరసింహ చెప్పాడు. ఈ క్రమంలో నరసింహ కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరసింహ నదిలో దూకినట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గజఈత గాళ్లతో నదిలో గాలించి నరసింహ మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేంద్రబాబు చెప్పారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించటం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కౌన్సిల్ సభ్యులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే..కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి హెచ్చరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై సత్తెనపల్లి మల్టీ మెంబరు అప్రోప్రియేట్ అథారిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే 102, 104 నంబర్లకు ఫోను చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.పద్మావతి, డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ నాగపద్మజ, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ముప్పాళ్ళ: తురకపాలెం గ్రామ మాజీ సర్పంచ్ బెల్లంకొండ ఊర్ధరాజు(78) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. తురకపాలెం గ్రామపంచాయతీకి పదేళ్లపాటు సర్పంచ్‌గా ఆయన పనిచేశారు. దూళిపాళ్ళ ఆంధ్రా బ్యాంక్ సహకార సంఘం డైరెక్టర్ గాను, రాజుపాలెం సమితిలో సభ్యుడిగాను వ్యవహరించారు.

పట్టణంలోని అన్ని సమస్యలకు పరిష్కారం

- ప్రభుత్వ విప్ పీఆర్కే ఆధ్వర్యంలో అభివృద్ధికి కృషి చేద్దాం
- ఐదు అంశాలు ఏకగ్రీవంగా ఆమోదం
- మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు



: సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు

మాచర్ల: పట్టణంలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు సమష్టిగా కృషి చేద్దామని, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు అన్నారు. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించిన సాధారణ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అభివృద్ధి పనులలో ఎక్కడా రాజీ పడే అవకాశం లేదన్నారు. ఎవరికైనా సమస్య ఉంటే ప్రభుత్వ విప్ పీఆర్కే ద్వారా తన దృష్టికి తీసుకొస్తే ఆ వార్డు ప్రజలకు న్యాయం చేసేందుకు అందుబాటులో ఉంటానన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని గుర్తుంచుకోవాలన్నారు. అందులో భాగంగానే మాచర్ల నియోజకవర్గంలో సైతం పీఆర్కే, పీవీఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేసే ఈ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లోనూ మద్దతు పలకాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను ఆయా వార్డు కౌన్సిలర్లు, కౌన్సిల్ సమావేశంలో చెప్పగా, ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అభివృద్ధికి సంబంధించి అజెండాలోని ఐదు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో ఏ వార్డులో సమస్య ఉన్నా పరిష్కరించటానికి తానెప్పుడూ ముందంజలో ఉంటానని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. నా దృష్టికి వచ్చిన ప్రతి అంశాన్ని పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తా. ఎక్కడా ప్రజల సమస్యల పరిష్కారానికి రాజీ పడం. ప్రభుత్వ విప్ పీఆర్కే సూచించిన ప్రతి సమస్యను పరిష్కరించటానికి నా వంతు కృషి చేస్తా అని చెప్పారు. ఏ ఒక్క సమస్య పెండింగ్‌లో ఉండదని చెప్పారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఆయా వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సంఘాలు, విద్యార్థులు మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబును ఘనంగా సత్కరించారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం

చైర్‌పర్సన్ సుబ్బమ్మ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ

దాచేపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నగర పంచాయతీ అభివృద్ధిలో దూసుకుపోతోందని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. నడికుడి సచివాలయంలో కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ సుబ్బమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. వార్డుల్లో చేపట్టాల్సిన పనులపై చర్చించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల వ్యవధిలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సారథ్యంలో దాచేపల్లిని నగర పంచాయతీగా ఏర్పాటు చేశామని అనంతరం దాచేపల్లిలో కోట్లాదిరూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.2.50 కోట్లతో దాచేపల్లి కొట్లాబజార్‌లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, దాచేపల్లికే ప్రమాదకరంగా ఉన్న కాటేరు వాగు ఆధునీకరణ చేపట్టామని వివరించారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో 3వేల మందికిపైగా నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చామని, జగనన్న కాలనీల్లో కనీస వసతులు ఏర్పాటు చేసి ప్రజలు నివాసం ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లా సెంటర్ నుంచి నడికుడి సచివాలయం వరకు రూ.3.50 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని, నగర పంచాయతీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేలా పనిచేస్తున్నామని చైర్‌పర్సన్ సుబ్బమ్మ తెలిపారు. రూ.16.50 కోట్లతో ప్రతి ఇంటికి కృష్ణా జలాలు తీసుకువస్తున్నామని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చైర్‌పర్సన్ సుబ్బమ్మ పేర్కొన్నారు. కౌన్సిలర్లు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ వేల్పూరి సత్యనారాయణ, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన అన్నపూర్ణ, షేక్ మస్తాన్ బీ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మైనింగ్ చట్టబద్ధంగా జరిగేలా చర్యలు



సున్నపురాయితో వచ్చిన ట్రాక్టర్ రాయల్టీ బిల్లు పరిశీలిస్తున్న ఏడీ అశోక్‌కుమార్

దాచేపల్లి: మైనింగ్ చట్టబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని భూగర్భ గనుల శాఖ ఏడీ అశోక్‌కుమార్ తెలిపారు. నడికుడి పారిశ్రామికవాడ వద్ద శుక్రవారం ఆయన క్వారీల నుంచి సున్నపురాయితో వచ్చిన వాహనాలు తనిఖీ చేశారు. ప్రతి వాహనం ఆపి రాయల్టీ బిల్లులను పరిశీలన చేసి బిల్లులు లేని వాహనాలను ఆపి రాయల్టీ కట్టించారు. ఈ సందర్భంగా ఏడీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన టెండర్ల ద్వారా ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ మైనింగ్ కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతలు తీసుకుందని, ఈ కంపెనీ ప్రతినిధులతో పాటుగా మైనింగ్ శాఖకు చెందిన సిబ్బంది నిరంతరం సున్నపురాయితో వచ్చిన వాహనాలు తనిఖీ చేస్తారని చెప్పారు. దాచేపల్లి మండల పరిధిలో 5 చెక్‌పోస్ట్ పాయింట్లు ఏర్పాటు చేశామని, 24గంటలపాటు ఈ పాయింట్ల వద్ద నిఘా కొనసాగుతుందని ఆయన వివరించారు. రాయల్టీ బిల్లులు లేకుండా సున్నపురాయి క్వారీ నుంచి మిల్లుల వద్దకు రాకుండా చర్యలు తీసుకున్నామని, రాయల్టీ బిల్లుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని ఆయన చెప్పారు. క్వారీ యజమానులు, మిల్లుల యజమానులు మైనింగ్ అధికారులకు ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులకు సహకరించాలని, ప్రతి వాహనానికి జీపీఎస్‌తో పాటుగా రాయల్టీ బిల్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఏడి వెంట మైనింగ్ అధికారులు, ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ డీఈ మధుసూదనరావు



మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయానికి నూతనంగా డీఈ ఓలేటి మధుసూదనరావు బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేటలో పబ్లిక్ హెల్త్ ఏఈగా పని చేసి పదోన్నతిపై మాచర్ల మున్సిపాలిటీకి డీఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబులను కలిసారు. వారు అభినందించి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

నారీశక్తి సమ్మేళనం జయప్రదం చేయండి



యామిని

పిడుగురాళ్ల: నారీశక్తి సమ్మేళనం జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా నారీశక్తి సమ్మేళన సంయోజక్ యామిని అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన నారీశక్తి సమేళ్లనానికి యామిని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్, సత్యసాయిబాబా దేవాలయం నిర్వాహకులు పుష్పలత భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి అధ్యక్షత వహించారు. యామిని మాట్లాడుతూ భారతదేశంలో స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్ష నుంచి బయట పడేలా వారిని చైతన్య వంతులుగా చేయడం కోసం వివిధ రంగాల మహిళల భాగస్వామ్యంతో భారత దేశ సమగ్ర అభివృద్ధికి సహకారం అందించేలా మహిళా శక్తిని జాగృత పరచడం కోసం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపట్ల జరుగుతున్న కుట్రలను అడ్డుకొని ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తూ, మహిళలలో భారతీయ చింతనను పెంపొందించడం కోసం డిసెంబర్ 17వ తేదీ ఆదివారం గుంటూరులో జరిగే నారీశక్తి సమ్మేళనంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల నారీశక్తి సమ్మేళన సంయోజక్ దేవరశెట్టి నాగలక్ష్మీ, గాయత్రి పరివార్, వాసవి వనితా క్లబ్, హనుమాన్ చాలీసా బృందం, లలితా సంఘం, సత్యసాయిబాబా సంఘం, కోలాట బృందాలు, ప్రాణిక హీలింగ్, సేవికాసమితి, వివేకానంద పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, నాగేంద్రస్వామి భక్తులు, రామతీర్థసమాజ భక్తులు, ఇతర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ



శాశ్వత భూ హక్కు పత్రం పంపిణీ చేస్తున్న డీటీ కీర్తి సుధా స్రవంతి

కారెంపూడి: మండలంలోని వీర లక్ష్మీపురం అగ్రహారం భూముల రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను మండల డీటీ కీర్తి సుధా స్రవంతి శుక్రవారం పంపిణీ చేశారు. వీర లక్ష్మీపురం అగ్రహారంలోని 548 ఎకరాల భూముల రీ సర్వే పూర్తయ్యిందని ఆ భూముల రైతులందరికీ జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నామని డీటీ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేతో మరో రెండు తరాల వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులుండవని డీటీ పేర్కొన్నారు. తహసీల్దార్ జి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో మండల సర్వేయర్ సులేమాన్‌ఖాన్ టీమ్ భూములు రీ సర్వే చేస్తోందని రైతులు దగ్గరుండి తమ భూములను రీ సర్వే చేయించుకోవాలని దాని వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు.

పౌష్టికాహారం అందించడమే జగనన్న గోరుముద్ద లక్ష్యం



మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు వంట పాత్రలను అందచేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: మధ్యాహ్నభోజన పథకం అమలు చేస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఆమె స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో గోరుముద్దకు సంబంధించి మండలంలోని 36 పాఠశాలలకు వంట పాత్రలను మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు పంపిణీ చేసి మాట్లాడారు. మధ్యాహ్న భోజనం పథకం అమలుచేస్తున్న పాఠశాలల్లో సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజు విద్యార్థులకు ఆహారంలో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందచేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఈ పథకాన్ని పాఠశాలల్లో మెనూ ప్రకారం మాత్రమే భోజనం అందించేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించి ప్రతి రోజు ఐఎంఎంఎస్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఈ గోరుముద్ద పథకం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవడం జరుగుతందని ఎంఈవో వేముల నాగయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలి



రెంటాల గ్రామ శివార్లో ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న వీఏఏ గొట్టం లక్ష్మారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతంగా అక్టోబర్ 5 నాటికి 100 శాతం పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రెంటాల, పశర్లపాడు, జెట్టిపాలెం, మిట్టగుడిపాడు, మల్లవరం, గోలి, తదితర గ్రామాలలో వీఏఏలు చేస్తున్న ఈ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో మొత్తం సాగు భూమి 25,826 ఎకరాలు ఉండగా ఈ ఏడాది ఇప్పటి వరకు 18,358 ఎకరాలలో మాత్రమే వివిధ రకాల పంటలను సాగు చేశారన్నారు. గ్రామాలలో వీఆర్వోలతో కలసి వీఏఏలు పంట పొలాలను సందర్శించి ఇప్పటి వరకు 13,592 ఎకరాలకు సంబంధించి 74 శాతం ఈ క్రాప్ బుకింగ్ చేయడం జరిగిందన్నారు. 25,826 ఎకరాలకు సంబంధించిన 25 శాతం రైతులకు ఈ కేవైసీ కూడా చేయించినట్లు తెలిపారు. మరో 75 శాతం రైతులకు ఈ కేవైసీ చేయాల్సిందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు గ్రామ వీఆర్వోలు సంయుక్తంగా ఈ క్రాప్ బుకింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రాప్ బుకింగ్, ఈ కేవైసీ చేయించుకోవడం వలన రైతులకు, కౌలు రైతులకు కూడా పండించిన పంటలు నష్టపోయినప్పుడు, పంటలను గిట్టుబాటు ధరలకు విక్రయించు కోవడం వంటి ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, వీఏఏలు, వ్యవసాయ, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ఏర్పాట్లపై పరిశీలన



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంపై మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ

రెంటచింతల: రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలోని ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి వెంటనే వైద్య సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య రక్ష ప్రతి పేద కుటుంబానికి ఒక రక్ష అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని గోలి గ్రామంలో పర్యటించి శనివారం గ్రామంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ఏర్పాట్లపై మెడికల్ ఆఫీసర్ నల్రా కృష్ణారెడ్డితో చర్చించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఏయే గ్రామాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందో ముందుగానే తెలుస్తుందని దీంతో ఆయా గ్రామస్తులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి వెంటనే మందులను, అవసరమైన వారికి కళ్లద్దాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతందన్నారు. మారుమూల గ్రామంలోని ప్రతి ఇంట్లో ఎవరికి ఎలాంటి వైద్యసహాయం కావాలో, ఏయే మందులు అవసరమో తెలుసుకోవడం జరుగుతుందన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని గోలి గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మున్నా చంద్రం, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నల్రా కృష్ణారెడ్డి, సీహెచ్‌ఓ పూజల నాగేశ్వరరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

గురజాల : పట్టణంలో వేంచేసియున్న శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారిని శుక్రవారం దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం కమిషనర్‌ను దేవాలయ కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణదత్తు, సభ్యుడు రెంటాల నాగేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి గణపతి సురేష్‌లు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

మిరపలో ఆకుముడతను వెంటనే అరికట్టాలి

నకరికల్లు: మిరపలో ఆకుముడత అధికంగా కన్పిస్తోందని, నివారణకు కాల్షియం నైట్రేట్‌ను లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున కలిపి ఎకరాకు ఒక కేజీ పిచికారీ చేయాలని ఉద్యాన అధికారి దాసరి నవీన్‌కుమార్ సూచించారు. డీడీఏ డీఆర్‌సీ శివకుమారి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, నకరికల్లు, రొంపిచర్ల మండలాల వ్యవసాయాధికారులు కె.దేవదాసు, విజయభాస్కర్ బృందం మండలంలోని కుంకలగుంట, జిల్లాపేటతండాలో మిరప పంటలను శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప ఆకు కిందిభాగంలో ముడుత కన్పిస్తోందన్నారు. నివారణ చర్యలు వివరించారు.

వినాయకుని ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి



రాయవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహ నిమజ్జనంలో పీవీఆర్



గణనాథుని లడ్డూ కైవసం చేసుకున్న గోవింద్‌నాయక్

మాచర్ల రూరల్: విఘ్నాలు తొలగించే వినాయకునికి చవితి రోజు నుంచి ప్రత్యేక పూజలు చేయటం సంతోషకరమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ సుందరలీల, ఎంపీటీసీ మట్టా వెంకటేశ్వర్లు, రాజేష్, రామసుబ్బారావు, బాబు, ప్రవీణ్, ఏసుపాదం తదితరులున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

వెల్దుర్తి: మండలంలోని కేపీ గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. లడ్డూకు వేలం పాట నిర్వహించగా మేరాజోత్ గోవింద్‌నాయక్ రూ.51,000లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పులిహోర పంపిణీ చేశారు. స్వామి వారి నిమజ్జన కార్యక్రమంలో డీజే ఏర్పాటు చేసి యువకులు, మహిళలు నృత్య ప్రదర్శన చేస్తూ సంతోషంగా నిమజ్జనం నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

డాక్టర్ షమా పార్విన్



జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ బృందం సభ్యులతో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది

మాచవరం: క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే వృత్తికి న్యాయం చేసినవాళ్లమవుతామని, అప్పుడే ప్రజలకు వైద్య వృత్తిపై విశ్వాసం, నమ్మకం కలుగుతుందని జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ బృందం సభ్యురాలు డాక్టర్ షమా పార్విన్ పేర్కొన్నారు. మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఢిల్లీ) బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రి పరిసరాలను, రక్త పరీక్షల లేబరేటరీ, ఐపీ వార్డులు, ఓపీ గది, కాన్పు గది, ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను, రిపోర్టులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగుల వివరాలు, మందుల లభ్యత, ఆసుపత్రి సౌకర్యాల వివరాలను విచారించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. కార్యక్రమంలో బృందం సభ్యులు డాక్టర్ కవిత అంబురాజ్, పీహెచ్‌సీ వైద్యాధికారులు చక్రవర్తి, ప్రసాద్, చంద్రహాసిత, అన్వేష్, హెల్త్ సూపర్‌వైజర్లు, , పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత

– సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి


సత్తెనపల్లి: పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యతని సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ డి.నాగ వెంకటలక్ష్మి అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో శుక్రవారం నిర్వహించారు. న్యాయమూర్తి నాగ వెంకట లక్ష్మి మాట్లాడుతూ కోర్టులో పనుల నిమిత్తం వచ్చే వారికి పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. న్యాయవాదులు ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం పరిసరాల్లో గోడ ప్రతులను అంటించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కడియాల ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారురి. లింగారెడ్డి, పలువురు న్యాయవాదులు, గుమాస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

స్వామినాథన్ సేవలు మరువలేనివి



మాచర్ల: దేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తగా విభిన్నంగా రాణించి వ్యవసాయాభివృద్ధికి విశేష కృషి చేసిన ఘనత స్వర్గీయ ఎంఎస్ స్వామినాథన్‌కు దక్కుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. శుక్రవారం చక్రధర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వామినాథన్ సేవలను కొనియాడుతూ పలువురు వక్తలు మాట్లాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంజిరెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంజిరెడ్డి హాస్పిటల్ డాక్టర్ అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

పిడుగురాళ్ల: పట్టణంలోని అంజిరెడ్డి విద్యా సంస్థల ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకొని పిడుగురాళ్ల పట్టణంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకిరెడ్డి ఆంజనేయులురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యా సంస్థల్లోని అధ్యాపకులు, విద్యార్థులు గుండె సమస్యలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార సలహాలు, సూచనలతో రికార్డు డిస్ప్లే చేసి వివరించారు. అనంతరం పట్టణంలోని అంజిరెడ్డి హాస్పిటల్ నుంచి జానపాడు రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గుండె వ్యాధులను నివారించేందుకు ప్రజలకు వ్యాయామం అవసరమని, ఆహార నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పట్టణ పుర వీధుల్లో బ్యానర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.